## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు



విద్యుత్ వైర్లను తాకకుండా ఉండేలా కొమ్మలను తొలగించిన దృశ్యం

**మునగపాక:** విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ రామకృష్ణ తెలిపారు. మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన మరమ్మతు పనులతో పాటు కొమ్మల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఈ సురేష్, ఏఈ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంఘ సర్వసభ్య సమావేశం రేపు

**మునగపాక:** మునగపాక రైతు సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం జరగనుందని సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక బైపాస్ రోడ్డులోని రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, నూతన కార్యవర్గం ఎన్నిక కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. మునగపాక పంచాయతీ పరిధిలోని మూల సంఘాల రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

### పూడిమడక రోడ్డు విస్తరణకు సహకరించాలి



నిర్వాసితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

**మునగపాక:** పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతమయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. రహదారి విస్తరణలో భాగంగా నిర్వాసితులకు ఆయన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణలో భూములు, గృహాలు కోల్పోయిన వారికి మెరుగైన పరిహారం అందజేస్తున్నామన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో అయిషా, ఎంపీడీవో ఎం.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

### కరుణించని వరుణుడు



ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు

**మునగపాక:** మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతంగా మారడంతో వర్షం పడుతుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూశారు. ఖరీఫ్ వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్న తరుణంలో వర్షం కోసం రోజూ వేచి చూస్తున్నారు. సాగునీటి కాలువలపై ఆధారపడి పంటల సాగు చేసే రైతులు ఆకాశంలో మేఘం చూసి వర్షం పడుతుందని ఆశించారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో రైతులు నిరాశ చెందారు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



బి.కె.పల్లిలో పారిశుధ్యంపై సూచనలు చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

**కోటవురట్ల:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఐవీఆర్ఎస్ గ్రామం బి.కె.పల్లిలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. లార్వా కారకాలను గుర్తించి తొలగించాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు, తాగి పడేసిన కొబ్బరి బొండాలలో నీరు నిల్వ ఉండడం వల్ల లార్వా పెరిగి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య మిథ్యగా మారింది. పదో తరగతి తరువాత ఇంటర్ చదువుకు ప్రైవేట్ కళాశాలలే దిక్కవుతున్నాయి. నక్కపల్లి మండలంలో మెరక గ్రామాల విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అందని ద్రాక్షగా మిగిలిపోయింది. గొడిచర్లలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని పాలకులు చేస్తున్న హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.



అప్‌గ్రేడ్ చేయాల్సిన గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల

# ఉన్నత విద్య.. పేదలకు మిథ్య..!

- అందని ద్రాక్షగా గొడిచర్ల జూనియర్ కళాశాల
- ఏళ్లు గడుస్తున్నా నెరవేరని హామీ
- ఇంటర్ కోసం ప్రైవేటు కళాశాలలే దిక్కు
- నక్కపల్లి మండలంలో మెరక గ్రామాల విద్యార్థుల ఇబ్బందులు

**నక్కపల్లి: మండలంలో మొత్తం 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.** ప్రతి ఏటా సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి బయటకు వస్తారు. వీరంతా ఇంటర్ చదువు కోసం నక్కపల్లి, పాయకరావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆశ్రయిస్తుంటారు. మెరిట్ ఉన్నవారికి అక్కడ ప్రవేశాలు లభిస్తే మిగతా వారు వేలల్లో ఫీజులు చెల్లించి తుని, అడ్డురోడ్డు, పాయకరావుపేట, యలమంచిలిలలో ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చేరాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మండలంలో మెరక గ్రామాలైన గొడిచర్ల, జగన్నాథపురం, కొత్తూరు, చీడిక, ముకుందరాజుపేట, గుల్లిపాడు, రమణయ్యపేట, రేబాక, దోసలపాడు, ఉద్దండపురం, సీతానగరం, తదితర గ్రామల విద్యార్థుల సౌకర్యార్థం గొడిచర్ల కేంద్రంగా జూనియర్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదన **గతంలో 20 ఏళ్ల క్రితం నుంచి ఉంది. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులుగా చేసిన వారు** ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు ఈ విద్యా సంవత్సరం నుంచే జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామంటూ హామీలు కూడా గుప్పించారు. 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనిత సైతం ఇదే హామీ ఇచ్చారు. తర్వాత విద్యా మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు కూడా హామీ ఇచ్చారు. అయితే అమలుకు మాత్రం నోచుకోలేదు.

**ఏటా విద్యార్థుల ఆశలు అడియాసలు**

మెరక గ్రామాల నుంచి సుమారు 400 మందికి పైగా విద్యార్థులు ప్రతి ఏటా పదో తరగతి పూర్తి చేసి ఇంటర్‌లో చేరుతున్నారు. వీరంతా తుని, పాయకరావుపేటలలో ఉన్న ప్రైవేటు కళాశాలల్లోనే చేరాల్సిన పరిస్థితి. గొడిచర్లలో ప్రభుత్వం జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే వీరంతా ఆర్థిక ఇబ్బందులు, దూరా భారం నుంచి ఉపశమనం **పొంది ఇంటర్ విద్య చదివే అవకాశాలున్నాయి. జూనియర్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన** స్థలం, సౌకర్యాలు ఉన్నాయి. ప్రభుత్వానికి కార్పస్ ఫండ్ చెల్లించేందుకు తల్లిదండ్రులు, దాతలు సైతం సిద్ధంగా ఉన్నారు. అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ప్రభుత్వం మాత్రం అనుమతులు మంజూరు చేయడం లేదు. విశాఖ డెయిరీ యాజమాన్యం జూనియర్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన కార్పస్ ఫండ్ చెల్లించేందుకు ముందుకు వచ్చింది. ప్రతి విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాల మంజూరవుతుందని విద్యార్థులు ఆశ పడుతున్నప్పటికీ పాలకులు మాత్రం వారి ఆశలు అడియాసలు చేస్తున్నారు. గతేడాది జరిగిన ఎన్నికల సమయంలో కూడా కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే గొడిచర్లలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాది పూర్తయినా అమలుకు నోచుకోలేదు. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేసి తరగతులు కూడా ప్రారంభించారని పలువురు గుర్తు చేసుకుని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జగనన్న ప్రభుత్వానికే చెల్లిందన్న పలువురు పేర్కొంటున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా గొడిచర్ల జెడ్పీ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని మెరక గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

### దూరాభారంతో అవస్థలు



మెరక గ్రామాల విద్యార్థులకు జూనియర్ కళాశాల లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదుకొనాల్సి వస్తోంది. గొడిచర్లలో ఏర్పాటు చేస్తామని 20 ఏళ్ల నుంచి చెబుతున్నారు. కానీ మంజూరు చేయడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన హామీ మేరకు నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు **చేశారు.** కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట **నిలబెట్టుకో**వాలి.

– పొడగట్ల వెంకటేష్, సర్పంచ్, ఉద్దండపురం

### ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పేదలకు మేలు



మెరక గ్రామాల్లో సుమారు 400కిపైగా పేద విద్యార్థులు ప్రతి ఏటా పదో తరగతి పూర్తి చేసుకుంటున్నారు. ఇంటర్ కోసం తుని, పాయకరా**వుపేట,** నక్కపల్లి వెళ్లాల్సి వస్తోంది. మండలంలో **ఒకే జూని**యర్ కాలేజీ ఉండటం వల్ల కొద్ది మందికి **మాత్రమే** ఉచితంగా చదువుకునే అవకాశం లభి**స్తోంది.** గొడిచర్లలో జూనియర్ కళాశాల **ఏర్పాటు** చేస్తే మెరక గ్రామాల్లో పేద విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.

– నల్లల రామకృష్ణ, గొడిచర్ల

### కాలుష్య కారకమైన పరిశ్రమలతో ప్రమాదం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

**మునగపాక:** కాలుష్య కారకమైన పరిశ్రమలతో ప్రమాదమని, ప్రభుత్వం వెంటనే అటువంటి చర్యలను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలోని రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటిపల్లి పంచాయతీ పరిధిలోని పారిశ్రామిక అవసరాల కోసం భూములను ప్రభుత్వం సర్వే చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలన్నారు. పరిశ్రమల కోసం సేకరించే భూములకు పక్కనే గృహాలు కూడా ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పట్టాదారులకు, సాగుదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి ఎటువంటి పరిశ్రమలు తీసుకువస్తున్నారనే విషయాలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు ఆళ్ల మహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

### వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నేడు

**మునగపాక:** తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తోసా ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ బుక్స్ అందజేస్తామన్నారు.

## బండిమాంబ సన్నిధిలో ధర్మశ్రీ



ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న కరణం ధర్మశ్రీ

**యలమంచిలి రూరల్:** వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ శుక్రవారం ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాజకీయంగా తనకు మంచి జరగాలని కోరుకున్నారు. నియోజకవర్గంలో అన్ని పార్టీల రాజకీయ నాయకులు తమ కార్యకలాపాలు ప్రారంభించే ముందు బండిమాంబను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి పనిచేసేలా తనను దీవించాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము, ఉద్దండం త్రినాథరావు, కరణం రవి, కరణం వెంకట్రావు, వీసం బంగారుబాబు, జామి రమణ, వీసం వాసు, దిమిలి రమణబాబు, కొత్వాల్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## 28న పూడిమడక రోడ్డు విస్తరణ బాధితుల పాదయాత్ర



మునగపాకలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

**మునగపాక:** పూడిమడక రోడ్డు విస్తరణ బాధితుల కు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 28న పాదయాత్ర చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్య దర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం మునగపాకలో సంతకాల సేకరణతో పాటు మెయిన్ రోడ్డులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం బాధితులకు పరిహారం అందించాలన్నారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భూములు, గృహాలు కోల్పోయే నిర్వాసితులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు నగదు రూపంలో పరిహారం అందించాలన్నారు. టీడీఆర్ బాండ్ల వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. రహదారి విస్తరణకు అందరూ సమ్మతమేనని, అయితే బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. అచ్యుతాపురం హైస్కూల్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రలో నిర్వాసితులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘ కన్వీనర్ ఆర్.రాము, కో–కన్వీనర్ సదాశివరావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీపీఎం నాయకులు ఎస్.బ్రహ్మాజీ, కూండ్రపు సోమునాయుడు, బుద్ద రంగారావు, బాబూరావు, ఆడారి శ్రీనివాసనాయుడు, బొడ్డేడ సూర్యచంద్రరావు, కాండ్రేగుల నాయుడు, కదారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణంపాలెం నిర్వాసితులకు న్యాయం చేయాలి



నినాదాలు చేస్తున్న కృష్ణంపాలెం గ్రామస్తులు

**రాంబిల్లి(అచ్యుతాపురం):** ఎస్ఈజెడ్ ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదని సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి దేముడుబాబు అన్నారు. శుక్రవారం ఆయన కృష్ణంపాలెం వెళ్లి అక్కడి నిర్వాసితులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిహారం పంపిణీలో, ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి లబ్ధిదారుల్ని ఎంపిక చేయడంలోనూ ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పాటు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 18 ఏళ్ల క్రితం ఐదున్నర లక్షల రూపాయలకు ఒక్కో ఎకరం తీసుకున్న భూములకు సంబంధించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పటికీ సరిగ్గా అమలు చేయలేదని వాపోయారు. ప్రస్తుతం భూమి ధర ఎకరాకు కనీసం 23 లక్షలు ఉందని, ఈ వ్యత్యాసం ఎవరు భరిస్తారని ఆయన ప్రశ్నించారు. లాటరీ పద్ధతిలో కేటాయించిన ప్లాట్లకు సంబంధించి అన్నదమ్ముల కుటుంబాలను వేరు చేసేలా పరిస్థితులు ఉన్నాయన్నారు. లబ్ధిదారులు అందరికీ ఒకే చోట ఇల్లు, సామాజిక అవసరాలు కల్పించాలని, జీవన భృతి కింద నెలకు రూ.26వేల పరిహారం, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## మునగపాక పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

**మునగపాక:** స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమావతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ ఆస్పత్రిలోని వార్డులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఎటువంటి రోగాలు సంభవించకుండా ఉండేందుకు గ్రామాల్లో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, ఆరోగ్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**నర్సీపట్నం:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. లోన్ బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు కెమెరా, లొకేషన్లు, ఫాన్ కాంటాక్ట్స్ ఫోటోలు అనుమతి ఇవ్వడం వల్ల సైబర్ నేరగాళ్లకు మన ఫోన్ యాక్సెస్ ఇచ్చేసినట్టేనని తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

## దేవవరంలో పారిశుధ్య పనులు

**నక్కపల్లి:** మెయిన్ రోడ్డుకు ఇరువైపులా బహిర్భూమికి వెళ్లే కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో సీతారామరాజు హెచ్చరించారు. మండలంలో దేవవరంలో శుక్రవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. వీధుల్లో చెత్తను తొలగించి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీశారు. బావుల్లో క్లోరినేషన్ పనులు చేశారు. ఇళ్లల్లో ఊడ్చిన చెత్తను ఆరుబయట రోడ్ల మీద వేయొద్దని ఎంపీడీవో సీతారామరాజు, కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. పంచాయతీ సిబ్బంది ఉచితంగా అందజేసిన ప్రత్యేక డబ్బాల్లో వేయాలన్నారు. ఐవీఆర్ఎస్ గ్రామం కావడంతో ప్రతి వారం ఈ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని ఎంపీడీవో తెలిపారు. అనంతరం దేవవరం నుంచి నామవరం వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించాలని గ్రామస్తులకు ఎంపీడీవో సూచించారు.

### నిర్వాసితులకు చెక్కుల పంపిణీ



నిర్వాసితులకు చెక్కులు అందిస్తున్న అధికారులు

**అచ్యుతాపురం:** అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మాణాలు కోల్పోతున్న హరిపాలెంకు చెందిన ఐదుగురు నిర్వాసితులకు శుక్రవారం ఆర్డీవో ఆయిషా, స్థానిక తహశీల్దార్ చెక్కులు పంపిణీ చేశారు. రోడ్డు విస్తరణకు సంబంధించి నిర్మాణాలు కాకుండా భూములు కోల్పోతున్న వారికి టీడీఆర్‌లు అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

### నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

**నర్సీపట్నం :** ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి వైద్య సిబ్బందికి సూచించారు. మాకవరపాలెం మండలం, చినరాచపల్లిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించేలా ప్రజల్లో చైతన్య తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులతో పాటు దోమల ద్వారా సోకే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె వెంట సీహెచ్‌వో రమేష్, సిబ్బంది ఉన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ‘చిక్కాల’కు సన్మానం



చిక్కాల రామారావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**పాయకరావుపేట:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావును శుక్రవారం పెంటకోటలోని ఆయన వద్ద పలువురు సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, తదితరులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పన్నీరు పాపారావు, కోడ కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, వంగలపూడి సరస్వతీ రామారావు, చేపల నాగమణి తాతాజీ, పందిరి ధర్మశ్రీ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, మంగవరం గ్రామ శాఖ అధ్యక్షుడు సూరకాసుల అన్నవరం, పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి నిధులతో పంట కాలువల నిర్మాణం



ఒడ్డిమెట్టలో పంటకాలువల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

**నక్కపల్లి:** ఉపాధి హామీ పథకం నిధులతో పంట కాలువల నిర్మాణం చేపట్టవచ్చని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. శుక్రవారం ఆయన ఒడ్డిమెట్టలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పంట కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసినట్టు చెప్పారు. రైతులకు ఉపయోగపడేలా కాలువలు, మట్టిరోడ్లు నిర్మించుకోవచ్చన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి కొబ్బరి, మామిడి మొక్కలు సరఫరా చేయడంతో పాటు వాటి సంరక్షణకు కూడా నిధులు కేటాయిస్తామన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండా ఫారం పాండ్స్‌ను నిర్మించుకుని సాగు అవసరాల ఉపయోగించుకోవాలన్నారు.

## వైద్య సేవలపై ఆరా

**ఎస్.రాయవరం:** పీహెచ్‌సీ పరిధిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆయుష్మాన్ భారత్ జిల్లా ఆరోగ్య బృందం సభ్యులు ఆరా తీశారు. శుక్రవారం ఉప్పరాపల్లి గ్రామంలోని వెల్‌నెస్ కేంద్రం పర్యవేక్షణలో అందుతున్న సేవలపై ప్రజలతో బృందం సభ్యులు మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. నమోదైన రికార్డులు పరిశీలించారు. ఈ క్యాక్రమంలో బృందం సభ్యులు జిల్లా గణాంకాల అధికారి రామచంద్రరావు, డీపీఈవో కెజజగదీష్, డేటా మేనేజర్ వై.జనార్దన్‌రావు, వైద్యాధికారి వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన



స్మార్ట్ మీటర్లు వద్దని నిరసన తెలుపుతున్న మహిళలు

**ఎస్.రాయవరం:** గ్రామాల్లో ఉన్న ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే అదనపు బిల్లులు రావడమే కాకుండా, విద్యుత్ వినియోగానికి ముందుగా బిల్లు చెల్లించాల్సి వస్తుందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు. కొత్తపోలవరం గ్రామంలో వినియోగదారులతో కలిసి స్మార్ట్ మీటర్లు వద్దని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటికి అవసరం ఉన్నంత వరకు రీచార్జ్ చేసుకుంటే ఎప్పుడు అయిపోతుందో తెలియక, కరెంటు ఆగిపోతే చీకటిలో ఉండాల్సి వస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రాయితీ ఎత్తి వేసే పరిస్థితి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు పెనుభారంగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుమారి, అమ్మాజీ, వెంకటలక్ష్మి రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం



సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ లోవరాజు, తదితరులు

**ఎస్.రాయవరం:** చిత్తశుద్ధితో పనిచేసిన అధికారులకు ఎక్కడికి వెళ్లినా గుర్తింపు ఉంటుందని కొత్త రేవు పోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు అన్నారు. గ్రామ సచివాలయంలో ఐదేళ్ల పాటు సేవలు అందించి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండల స్థాయిలో చేసే పనులు గ్రామ స్థాయిలో జరగాలని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ఆ క్రమంలో వచ్చిన సచివాలయ సిబ్బంది, వెల్‌నెస్, రెవెన్యూ అధికారులు విశేష సేవలు అందించారన్నారు. నిస్వార్థంగా పని చేసిన ఉద్యోగులు ఎక్కడికెళ్లినా మరిచిపోయే పరిస్థితి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగా విధుల్లో చేరిన సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.